కబడ్డీ జట్లతో గొంగిడి మహేందర్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, డిసెంబర్ 19 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ డీసీసీబీ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆలేరు జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో 50వ బాల, బాలికల జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా రంగానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి ఆలేరుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇక్కడ ఎంపికైన బాలికల జట్టు ఈ నెల 22 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని హకీంపేటలో బాలిక స్పోర్ట్స్ హాస్టల్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. బాలుర జట్టు ఈ నెల 27 నుంచి 30 వరకు జనగాం జిల్లాలో జరిగే పోటీల్లో తలపడనుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, కోశాధికారి గంధమల్ల కుమార్, పూల చంద్రకుమార్, జిత్తు నరేశ్, పీఈటీలు రమణ, రజనీ, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలి

- కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ధర్నా

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 19 : రాత పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ పోరాటాల హక్కుల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి బండ ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 29న నిర్వహించనున్న రాత పరీక్షను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుతో 48గంటల నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏండ్ల తరబడిగా వెట్టిచాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను వయోభారం, తదితర సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాత పరీక్షలను రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోరాటాల హక్కుల కమిటీ జిల్లా నాయకులు కె.కవిత, చంద్రకళ, అనిత, వెంకటరమణ, మంజుల, జయలక్ష్మి, ధనమ్మ, ఇందిర, శ్రీలక్ష్మి, వినోద, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి : ఆర్డీఓ

ఆత్మకూరు(ఎం) ఇందిరమ్మ ఇండ్ల కోసం వివరాలను మొబైల్‌లో నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 19 : పట్టణ కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ దరఖాస్తుదారుల ఇండ్ల సర్వేలు వేగవంతం చేయాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లిలోని పద్మానగర్ కాలనీలో సర్వే తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలం ఉండి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని సూచించారు. ఆయన వెంట ఎం ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, మున్సిపల్ సూపర్‌వైజర్ ఆదిత్య, వార్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

ఆత్మకూరు(ఎం) : ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కోసం గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు తుక్కాపురం, రహీంఖాన్‌పేట, సర్వేపల్లి గ్రామాల్లో సర్వేను ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా సర్వేను చేపట్టి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, డిసెంబర్19 : పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తి గోదాముపై సివిల్ సప్లయ్ అధికారుల బృందం బుధవారం రాత్రి దాడిచేశారు. 31 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారి బాలమణి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన కొడితాల వెంకటేశం తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి గోదాములో నిల్వచేసి అక్రమ వ్యాపారం చేస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌లకు అప్పగించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తాసీల్దార్ బాలమణి తెలిపారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, డిసెంబర్19 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి 25 రోజులు గడుస్తున్నా నేటికీ 30శాతం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని, వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాయలంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐకేపీ, పీఏసీఎస్ నాబార్డు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిల్లులు కొట్టి ఓటీపీలు పూర్తి చేసి 25 రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాల్లో జమ కాక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాసంగి ప్రారంభమై వరినాట్లు పడుతున్నా పెట్టుబడులకు డబ్బులు లేక ప్రైవేటు ఫైనాన్స్‌లలో అప్పులు తెచ్చుకుంటూ ఆర్థికంగా నష్ట పోతున్నారన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, గన్నెబోయిన విజయ్ భాస్కర్, కందుల హన్మంతు, బాలరాజు, లెనిన్, శివ, రవిందర్, నర్సింహ పాల్గొన్నారు.

మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

మోత్కూరులో సంతకాల సేకరణ నిర్వహిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు, డిసెంబర్19: మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోత్కూరు వెనుక బడిన ప్రాంతమన్నారు. గతంలో తాలూకా కేంద్రంగా కొనసాగిన మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడానికి అవసరమైన అర్హతలు ఉన్నాయని తెలిపారు.

జిల్లా కేంద్రానికి మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలు 50 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.నర్సయ్య, ఎల్.రఘువర్ధన్, బి.మధు, మస్తాన్, నర్సింహ, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులు లేక పాఠశాల మూత

- లింగరాజ్‌పల్లి నుంచి పక్కగ్రామానికి వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులు
- పాఠశాలను తెరిపించాలని కోరుతున్న గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజ్‌పల్లిలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

ఆత్మకూరు(ఎం), డిసెంబర్19 : మండలంలోని లింగరాజ్‌పల్లిలో 50సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల ఏర్పడిన నాటి నుంచి గ్రామంలో ఎంతోమంది ఇదే పాఠశాలలో చదువుకున్నారు. గత సంవత్సరం 25మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ప్రారంభం నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గడంతోపాటు గ్రామంలోని బడిఈడు పిల్లలకు ఉపాధ్యాయులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఆరు నెలల క్రితం పాఠశాల మూతపడింది. గ్రామం నుంచి 12మంది విద్యార్థులు పక్క గ్రామమైన పల్లెర్లకు 3కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి చదువుకుంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మూతపడిన పాఠశాలను వెంటనే తెరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పక్క ఊరుకు వెళ్లి చదువుకుంటున్నారు

గ్రామంలో ఉన్న పాఠశాల మూతపడడంతో విద్యార్థులు పక్క గ్రామమైన పల్లెర్లకు వెళ్తున్నారు. నడుచుకుంటూ, సైకిల్, ఆటోలపై వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉన్న ఊరిలోనే పాఠశాలను తెరిపించి విద్యార్థులకు పాఠాలు బోధించాలి.

- దుర్గం యాదమల్లు, గ్రామస్తుడు

10మంది విద్యార్థులు ఉంటే పాఠశాలను ప్రారంభిస్తాం

గ్రామంలో 10మంది విద్యార్థులు ఉంటే వచ్చే విద్యాసంవత్సరం నాటికి మూతబడిన పాఠశాలను తెరిపిస్తాం. గ్రామంలోని ప్రజలందరూ... తమ పిల్లలను సొంత గ్రామంలో ఉన్న పాఠశాలకు పంపించే విధంగా కృషి చేయాలి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతోనే పాఠశాల మూతపడింది.

- కొత్త మహదేవరెడ్డి, ఎంఈఓ

'కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి'

మోత్కూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌కుమార్

మోత్కూరు, డిసెంబర్19 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మర్రి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ఎంపీగా, కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాకు బుద్ధి చెప్పాలని తెలిపారు. ఆయన వెంట నాయకులు గుంటి దేవ, బి.శ్రీను, కె.పరమేశ్, పి.రమేశ్, కె.భిక్షం, శ్రీరాములు, శ్రీను పాల్గొన్నారు.

అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలి : భువనగిరి అర్బన్ : హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే భర్తరఫ్ చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం భువనగిరి లోని ప్రధాన రహదారిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాసాని మహేందర్ మాట్లాడుతూ చాయ్ అమ్మే వ్యక్తిని ప్రధాన మంత్రిని చేసిన ఘనత అంబేద్కర్‌దేనన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ని అవమాన పరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పార్లమెంట్‌లో సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగస్వామి, వీరస్వామి, భిక్షపతి, గుండు కృష్ణ, శ్రీశైలం, బండారు జంహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఆలేరులో పోలీసుల విస్తృత తనిఖీలు

ఏసీపీ రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆలేరు టౌన్, డిసెంబర్ 19 : ఆలేరు పట్టణంలో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. యాదాద్రి ఏసీపీ రమేశ్ కుమార్ నేతృత్వంలో 30మంది పోలీసులు పాన్ షాపులు, కొన్ని కిరాణ దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. మంతపురి చౌరస్తా నుంచి దుర్గమ్మ గుడి వరకు పలు కిరాణ షాపుల్లో తనిఖీలు చేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పలు షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అనంతరం పెద్దవాగు వంతెన వద్ద వాహనాల తనిఖీని చేపట్టారు. సరైన పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలు, ఒక కారు, రెండు ఆటోలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తనిఖీల్లో యాదగిరిగుట్ట సీఐ ఎం కొండల్ రావు, స్థానిక ఎస్ఐ కె. రజనీకర్, స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాన్ని ఇతర శాఖలకు ఇవ్వద్దు

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి కౌన్సిలర్ అరుణపూర్ణచందర్ వినతి

మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ అరుణపూర్ణచందర్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 19 : పట్టణ పరిధిలోని రాయగిరి 4వ వార్డులోని వార్డు కార్యాలయ భవనాన్ని ఇతర శాఖలకు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ నాయిని అరుణపూర్ణచందర్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణపూర్ణచందర్ మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీ భవనంగా ఉన్న ప్రస్తుత వార్డు కార్యాలయాన్ని ఇతర శాఖలు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నాయని అన్నారు. వార్డులోని అన్నివర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉన్న భవనాన్ని ఇతర శాఖలకు స్వాధీనం చేస్తే వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని గుర్తుచేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వార్డు ప్రజలు ఏర్పుల అరవింద్, భరత్, నవీన్, సాయి, మహేందర్, నరేశ్, దయాకర్, శివకుమార్, హరినాథ్‌రెడ్డి, లాలూప్రసాద్, మహేందర్, ఉపేందర్ తదితరులున్నారు.

తరుణ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఆత్మకూరు(ఎం) పల్లెర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులను అందజేసిన దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్19 : తరుణ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాజీ జడ్పీటీసీ కె.నరేందర్‌గుప్తా అన్నారు. మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో గురువారం గుర్రం తరుణ్ కుమార్ 6వ వర్ధంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోఓ రాములునాయక్, ఫౌండేషన్ చైర్మన్ గుర్రం లావణ్యనర్సింహ, హెచ్ఎం వెంకటనర్సయ్య, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నరసింహగౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ వ్యవసాయ శాఖాధికారిగా అపర్ణ

అపర్ణ

ఆత్మకూరు(ఎం), డిసెంబర్19 : మండల వ్యవసాయశాఖ నూతన అధికారిగా అపర్ణ గురువారం విధులు చేపట్టారు. భువనగిరి ఏడీఏ కార్యాలయంలో ఏఓ టెక్నికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అపర్ణ ఆత్మకూరు(ఎం) మండలానికి వ్యవసాయాశాఖాధికారిగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన అరుణ ఉన్నత చదువుల కోసం సెలవులపై వెళ్లారు.

జనవరి ఒకటి నుంచి ఏపీజీవీబీ..టీజీబీగా మార్పు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 19: వరంగల్ కేంద్రంగా యాదాద్రి జిల్లాలో సేవలందిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)కు సంబంధించి జిల్లాలోని బ్రాంచులన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లుగా 2025 జనవరి 1 నుంచి అందుబాటులోకి వస్తాయని ఏపీజీవీబీ భువనగిరి కార్యాలయ రీజినల్ మేనేజర్ చెన్న శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఏపీజీవీబీ బ్యాంకు బోర్డులను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చబోతున్నారని అన్నారు. ఈ మార్పుల నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు జిల్లాలోని ఏపీజీవీబీ సేవలు, ఏటీఎంలు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతోపాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతాయని ఖాతాదారులు గమనించాలన్నారు. జనవరి 1 నుంచి బ్యాంకు పాస్ పుస్తకాల ఓచర్లు, డీడీలు, చెక్కు పుస్తకాలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 19 : తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్‌లు అందివ్వనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వరకు మైనారిటీ మహిళలు (ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సి) tgobmms.cgg.gov.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9505640004 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోటకొండూర్ వాసికి హ్యూమన్ రైట్స్ డిఫెండర్ జాతీయ అవార్డు

జాతీయ అవార్డు అందుకుంటున్న సురపంగ శివలింగం

మోటకొండూర్, డిసెంబర్ 19 : హ్యూమన్ రైట్స్ డిఫెండర్ జాతీయ అవార్డును మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన సురపంగ శివలింగం దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన శివలింగం మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా దళిత మానవ హక్కుల ఉద్యమంతో ప్రారంభమై ఉపాధి హామీ చట్టం సమగ్ర అమలుకు గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక కార్యక్రమాలు జరుపడం, దళిత గిరిజన చట్టాలు అమలుకోసం చేసిన కృషికి గుర్తింపుగానే ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ అవార్డును దళితులు, ఉపాధి హామీ కూలీలకు, అసంఘటిత రంగ కార్మికులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి రమణి

మోత్కూరు, డిసెంబర్19: ఇంటర్మీయట్‌లో వందశాతం ఫలితాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి సి.రమణి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనఖీ చేశారు. తరగతి గదుల్లో తిరిగి విద్యాబోధన తీరును పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక తరగతులను నిర్వహించి బోధన చేయాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ప్రభాజస్టిస్ ఉన్నారు.

పంట వివరాలను తప్పనిసరి నమోదు చేయాలి

వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ పద్మావతి

ఆత్మకూరు(ఎం), డిసెంబర్19 : రైతులు సాగుచేసిన అన్నిరకాల పంటల వివరాలను వ్యవసాయాశాఖ అధికారులు తప్పనిసరి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆలేరు డివిజన్ ఏడీఏ పద్మావతి అన్నారు. మండలంలోని పల్లెర్ల రైతు వేదికలో గురువారం వ్యవసాయాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు.. రైతుబీమా కోసం అర్హులైన రైతులందరూ దరఖాస్తులు చేసుకోవాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే విధంగా సాగు చేసే విధానాలపై వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు రైతులు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ అపర్ణ, ఏఈఓలు మనీషా, సరిత, సౌమ్య, క్రాంతి, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఎన్నారం విద్యార్థికి ద్వితీయ స్థానం

డీఈఓ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న బండమీది సిరి

రామన్నపేట, డిసెంబర్19 : మండలంలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బండమీది సిరి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాలో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నమాల గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందుకున్నట్లు చెప్పారు.

కేసీఆర్‌పై అక్కసుతోనే ధరణిని తీసివేస్తున్న ప్రభుత్వం

- గుండాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి

గుండాల, డిసెంబర్ 19: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అక్కసుతోనే గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసివేస్తున్నదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ధరణి పట్ల సరైన అవగాహన లేదని, కేసీఆర్ ఆనవాళ్లను చెరిపి వేయాలనే దుర్బుద్ధితో ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ధరణి వల్ల రైతుల భూములకు రక్షణ ఏర్పడిందని, రైతుకు తెలియకుండా భూమిని ఎంతటి అధికారి అయినా మార్పులు చేర్పులు చేసే అధికారం లేకుండా రైతు వేలి ముద్రతోనే మార్పు చేర్పులకు ధరణిలో అవకాశం ఉందని తెలిపారు. అటువంటి ధరణిని తొలగించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాక్షసానందం పొందుతున్నారని అన్నారు. మళ్లీ అనుభవదారు కాలం తీసుకురావడం సీఎం, మంత్రుల అనాలోచిత నిర్ణయం అని, అనుభవదారు కాలం వల్ల పట్టాదారుకు ఇబ్బందులు ఎదురై పచ్చని గ్రామాల్లో గొడవలు తలెత్తే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకమైన ధరణి విధానాన్ని కొనసాగించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు

వలిగొండ, డిసెంబర్19 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జాతీయ కమిటీ పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టిడికి వెళ్తున్న మాల మహానాడు నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. అనంతరం మాల మహానాడు ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పెరుమాండ్ల యాదగిరి, రాపోలు పవన్ కుమార్, నాగేశ్, పూర్ణ అంజయ్య, నీలం నరేందర్, నర్సింహ, కృష్ణ, కట్ట సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం ప్రాథమిక పాఠశాలలో బెంచీల విక్రయం

రామన్నపేట, డిసెంబర్19: మండలంలోని సిరిపురం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇనుప డెస్క్ బెంచీలను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 16న పాఠశాలకు చెందిన బెంచీలను ఆటోలో తరలిస్తుండగా స్థానికులు గమనించి ఆరా తీసి జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు కోఆర్డినేటర్‌లతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. ఈవిషయంపై ఫోన్‌లో డీఈఓ సత్యనారాయణను సంప్రదించగా నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల సౌకర్యార్థం దాతలు సమకూర్చిన డెస్క్ బెంచీలను విక్రయించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్ గురువారం పాఠశాలను సందర్శించి బాధ్యులైన వార